AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

తెయూలో బతుకమ్మ సంబరం



2



2

41 లీటర్ల డిఫెన్స్ లిక్కర్ పట్టివేత



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు పోషన్ బీ, పడాయి బీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవన్‌లో మూడురోజు శిక్షణ తరగతులు నిర్వహించగా, డీడబ్ల్యూఓ రసూల్ బీ హాజరై అంగన్వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు.



## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



**అక్షరటుడే, బాన్సువాడ:** మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డోంగ్లీ శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల ప్రవీణ్ కుమార్ అందజేశారు. అనంతరం శ్రీనివాస్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సత్యవతి రాథోడ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ పటేల్, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత శివకుమార్ పటేల్, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ఎర్రం సంజీవ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్ కార్యాలయం ముట్టడి





**అక్షరటుడే, భీమ్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లు పెంచి ఇవ్వాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, సీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని భీమ్‌గల్ తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మరిచిపోయి పింఛన్‌దారులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో పింఛన్లు పెంచి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఏడాదిన్నర గడిచినా ఊసెత్తకపోవడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. అనంతరం భీమ్‌గల్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈనెల 20న జీపీల ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ భీమ్‌గల్, ధర్పల్లి ఇన్‌ఛార్జీలు దీపక్, రాజేందర్, సుధీర్, వీహెచ్‌పీఎస్ నాయకులు మోహన్, బాపూరావు, భూమన్న, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# టెండర్ల జోరు

పల్లెల్లో జోరుగా కల్లు దుకాణాల టెండర్లు కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణకు భారీగా పోటీ నెలకొంది. వేలంపాటలో రూ.లక్షలు పాడి మరీ కొందరు డిపోలను దక్కించుకుంటున్నారు. ప్రతి ఏటా దసరాకు గ్రామాల్లో కల్లు డిపోల టెండర్లు నిర్వహిస్తారు. అప్పుడు వేలంలో దుకాణాన్ని దక్కించుకున్న వారు ఏడాది పాటు కల్లు అమ్ముకోవచ్చు. ప్రస్తుతం దసరా సమీపిస్తుండడంతో పల్లెల్లో కల్లు దుకాణాల టెండర్ల జోరు కనిపిస్తోంది. ఏ నలుగురు కలిసినా టెండర్ల గురించే చర్చించుకుంటున్నారు.

–అక్షరటుడే, కామారెడ్డి

- కల్లు దుకాణాలకు భారీగా పోటీ
- వేలంలో రూ.లక్షలు పాడి దక్కించుకుంటున్న పలువురు
- దసరాకు కొత్త ముస్తేదారుల చేతుల్లోకి డిపోలు
- జిల్లాలో యథేచ్ఛగా కల్తీ కల్లు అమ్మకాలు

గ్రామాల్లో కల్లు దుకాణం కొనసాగించాలంటే గతంలో పెద్దగా కష్టం ఉండేది కాదు. చెట్టునుంచి కల్లు తెచ్చి డిపోలో నీళ్లు కలిపి విక్రయించేవారు. అయితే గ్రామాభివృద్ధి కమిటీలకు కొంతమొత్తం చెల్లించేవారు. ప్రస్తుతం కల్లు దుకాణాలు నిర్వహించడానికి పోటీ ఎక్కువైంది. దాంతో గతంలో మాదిరిగా ఇంటికొకరు చొప్పున కాకుండా ఇప్పుడు ఎవరో ఒకరికి మాత్రమే ఇస్తున్నారు. పోటీ పెరగడంతో వేలం విధానాన్ని తీసుకొచ్చారు. వేలంలో ఎక్కువ పాడి దక్కించుకున్న వారికే కల్లు అమ్ముకునే అవకాశం ఉంటుంది. వేలంలో వచ్చిన ఆదాయాన్ని సంబంధిత కుల సంఘం, అసోసియేషన్‌లో ఉన్నవాళ్లు సమానంగా పంచుకుంటున్నారు. కొన్ని చోట్ల రూ.లక్షల్లో వేలం పాడుతుండగా.. పలు దుకాణాలకు రూ.కోట్లు పలుకుతున్నట్లు సమాచారం. గత సంవత్సరం ఓ డిపోను రూ.7 కోట్లకు వేలంలో దక్కించుకున్నట్లు ప్రచారం సాగింది. ప్రస్తుతం చాలా గ్రామాల్లో టెండర్ల ప్రక్రియ ముగిసినట్టుగా తెలుస్తోంది.

### కృత్రిమ కల్లు తయారీ

గ్రామాలు, పట్టణాల్లో రోజంతా కష్టపడి వచ్చిన వారు సాయంత్రం కల్లు తాగి పడుకుంటారు. అయితే తాటి, ఈత చెట్లు లేకపోవడంతో కల్లు డిపోల నిర్వాహకులు యథేచ్ఛగా కల్తీ కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. అల్ప్రాజోలం, డైజోఫాంతో కల్లు తయారు చేసి అమ్ముతున్నారు. దీనిని తాగిన ప్రజలు బానిసలుగా మారుతున్నారు. కల్లు లేకపోతే పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తున్నారు. రూ.లక్షలు పెట్టి వేలంలో దుకాణాలు దక్కించుకున్న వారు ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకోకుండా తమకు లాభాలు రావాలనే ఉద్దేశంతో కల్తీ కల్లు విక్రయిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

### మందు కల్లు రూ.10.. చెట్టు కల్లు రూ.150

గతంలో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ ఈత చెట్లు కనిపించేవి. ప్రస్తుతం ఈత, తాటి చెట్లు లేకపోవడంతో కల్లు దొరకడం లేదు. దీంతో కల్లు దుకాణాల్లో కల్తీ కల్లు విక్రయిస్తున్నారు. రూ.10 నుంచి రూ.20కి సీసా చొప్పున కృత్రిమ కల్లు అమ్ముతున్నారు. అయితే పలు గ్రామాల్లో ఈత వనాలు ఉన్నాయి. అక్కడ మాత్రం చెట్ల కల్లు దొరుకుతోంది. ఈ కల్లుకు మాత్రం రూ..100 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారు.

### పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో కల్లు దుకాణాల వేలం, కల్తీ కల్లుపై అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వేలం ప్రక్రియ కుల సంఘం జీవనోపాధికి సంబంధించిన అంశంగా చెబుతున్నారు. అయితే పెద్ద మొత్తంలో టెండర్ పాడిన వారు నష్టపోతున్నారు. మళ్లీ దసరా వచ్చే లోపు టెండర్లో చెల్లించిన మొత్తంతో పాటు డిపో నిర్వహణ, కూలీలు, మత్తు పదార్థాలకు వెచ్చించిన మొత్తంతో పెద్దమొత్తంలో అప్పుగా మారుతోంది. అనేక మంది ముస్తేదారులు టెండర్ తీసుకుని అప్పులు చెల్లించలేక ఆస్తులు అమ్ముకున్న ఘటనలు ఉన్నాయి. వీటిపై అవగాహన కల్పించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

### టెండర్లపై అవగాహన కల్పిస్తున్నాం

కల్లు దుకాణాల టెండర్ల వేలంపై అవగాహన కల్పిస్తున్నాం. అది వారి ఉపాధికి సంబంధించింది అంటున్నారు. జిల్లాలో కల్తీ కల్లు ఘటనలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. జిల్లాలో 413 కల్లు దుకాణాలకు లైసెన్సులు ఉన్నాయి. ఇప్పటి వరకు అక్రమంగా కల్లు విక్రయించిన వారిపై 192 కేసులు నమోదు చేసి 94 మందిని అరెస్ట్ చేశాం. 18 టీఎఫ్టీ లైసెన్సులు రద్దు చేశాం. ఒక సొసైటీ కూడా రద్దు చేశాం.

– హన్మంత్ రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కామారెడ్డి



## రైతులకు బస్తా యూరియా ఇప్పించలేని ఎంపీలెందుకు..?



**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రంలో రైతులకు బస్తా యూరియా ఇప్పించలేని ఎంపీలు ఉండి ఎందుకని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మళ్లీ చెప్పులు, పాస్‌బుక్‌లు లైన్లో ఉంచే దుర్భర పరిస్థితులు వచ్చాయన్నారు. ఈ మేరకు గురువారం వేల్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌కు ఉన్న ముందుచూపుతో సీజన్‌కు ముందే ఎరువులను రాష్ట్రంలో డంప్ చేసుకునేవాళ్లమన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎరువుల దిగుమతిపై అవగాహన లేక రైతుల ఉసురు పోసుకుంటోందన్నారు. అంతగా రైతులు ఇబ్బందులు పడొద్దు అనుకుంటే అర్వింద్‌కు ఉన్న పలుకుబడితో రాష్ట్రానికి యూరియా తెప్పించాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో యూరియా కొరత రోజురోజుకూ తీవ్రతరమవుతోందన్నారు.

### నెలరోజుల నుంచి హెచ్చరిస్తూనే ఉన్నాం..

రాష్ట్రంలో యూరియా కొరతను ముందు ఊహించి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరపున హెచ్చరిస్తూనే ఉన్నామని అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని ఆయన ఆరోపించారు. నిజామాబాద్, బాల్కొండ నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో యూరియా కోసం రైతులు అనేక కష్టాలు పడుతున్నారన్నారు.

## విద్యార్థులకు ఏఐ, వీఎఫ్ఎక్స్‌లో శిక్షణ



**అక్షరటుడే, కామారెడ్డి:** సినీరంగం వైపు అడుగులు వేయాలనుకుంటున్న విద్యార్థులకు ఏఐ, వీఎఫ్ఎక్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నామని ప్రముఖ సినీ నిర్మాత, లార్వెన్ ఫౌండర్ దిల్ రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన స్కిల్‌ప్లస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ, ధృడ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఉత్సాహం ఉన్న విద్యార్థులకు నిజామాబాద్ పరిధిలోనే ఏఐ, వీఎఫ్ఎక్స్‌లో ప్రత్యేక శిక్షణనిస్తామని స్పష్టం చేశారు. అనంతరం డిగ్రీతో పాటు వివిధ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగాలను పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో దిల్‌రాజు సతీమణి లార్విన్ కో-ఫౌండర్ వైగారెడ్డి, వివిధ కంపెనీలకు చెందిన సీఈవోలు రక్షిత్ రెడ్డి, మనీష్, సాయి కిరణ్, దేశ పాండే ఫౌండేషన్ ప్రతినిధులు శేఖర్, శ్రీకాంత్, సాందీపని కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్ రెడ్డి, ప్రిన్సిపల్ సాయిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



చింతకుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మోస్రా మండలం చింతకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్, అంగన్‌వాడీ సెంటర్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉన్నత స్థానాలకు చేరితే విస్తృత స్థాయిలో ప్రజలకు, సమాజానికి సేవ చేసే అవకాశం, అదృష్టం లభిస్తుందన్నారు. వ్యక్తిగతంగా మంచి భవిష్యత్తు, గౌరవం దక్కుతుందన్నారు. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళితే లక్ష్యాన్ని ఛేదించే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయుడిని అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడితే జీవితమంతా హాయిగా ఉండొచ్చన్నారు. తన విద్యార్థి దశలో ప్రస్థానాన్ని తెలియజేస్తూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని గమనించి, వండిన ఆహార నాణ్యతను పరిశీలించారు. అలాగే ప్రైమరీ పాఠశాలలో బాలుర కోసం వెంటనే మూత్రశాల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవో శ్రీనివాసులును ఆదేశించారు.

## నిజాం మెడలు వంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్



**అక్షరటుడే, ఇందూరు:** నిజాం మెడలు వంచిన వల్లభాయ్ పటేల్‌ను ఎప్పటికీ మరువలేమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ విమోచన దినోత్సవం ఛాయా చిత్ర ప్రదర్శనను గురువారం వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట యోధుల చరిత్రను గత ప్రభుత్వాలు చెరిపేసే కుట్ర చేశాయన్నారు. నిజాం నిరంకుశ పాలనకు, బ్రిటిష్ వారికి ఎదురు తిరిగి రాంజీ గోండు, దొడ్డి కొమరయ్య, షోయబుల్లాఖాన్, చాకలి ఐలమ్మ లాంటి వీరులు, వీర వనితల చరిత్ర భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిజామాబాద్ పేరును ఇందూరుగా మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ సమన్వయకర్త ధర్మానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంమోహన్ రెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంగరత్నం, పీఆర్‌వో డాక్టర్ దండు స్వామి, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి





**అక్షరటుడే, గాంధారి:** మహిళలు చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కామారెడ్డి జిల్లా జడ్జి నాగరాణి పేర్కొన్నారు. మండలంలోని ఐకేపీ భవనంలో గురువారం నిర్వహించిన మహిళా సాధికారత న్యాయ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అరాచకాలకు న్యాయపరంగా ఎదుర్కొనే అవకాశాలున్నాయన్నారు. గృహహింస చట్టం, బాల్యవివాహాల నివారణ, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, గుడ్ టచ్..బ్యాడ్ టచ్ వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ స్పెషలిస్టులు తులసి, శారద, తహశీల్దార్ రేణుకా చవాన్, ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## పొలాల్లో ఇసుక మేటలను త్వరగా తొలగించాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతుల పొలాల్లో వేసిన ఇసుక మేటలను త్వరగా తొలగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. లింగంపేట మండలం బురిగిద్ద గ్రామంలో ఇసుక మేట వేసిన రైతు సభావత్ లక్ష్మి పొలంలో ఈజీఎస్ ద్వారా చేపట్టిన ఇసుక మేటల తొలగింపు కార్యక్రమాన్ని గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుతో మాట్లాడుతూ.. అధైర్యపడవద్దని మీ పొలంలో ఇసుక మేటలను పూర్తిగా తొలగిస్తామన్నారు. ఈజీఎస్ ద్వారా ఉపాధి హామీకూలీలకు రూ. 1,21,000 కూలీ చెల్లించి పొలంలో ఉన్న 1200 క్యూబిక్ మీటర్ల ఇసుకను పూర్తిస్థాయిలో తొలగిస్తామని తెలిపారు. అధిక వర్షాల కారణంగా ఇసుక మేటలు వేసిన పొలాల రైతులకు అధికంగా లబ్ధిచేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. లింగంపేట మండలంలోని 41 గ్రామాల్లో సుమారు 287 ఎకరాలలో ఇసుక మేట వేసిందని ఆయన పేర్కొన్నారు. మళ్లీ పంటలు వేసుకునేలా పొలాలను సిద్ధం చేయాలని, తొలగించిన ఇసుకను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, ఇతర ప్రభుత్వ నిర్మాణాలకు ఉపయోగించాలని ఎంపీడీవో నరేశ్‌కు సూచించారు. ఇసుక మేటల తొలగింపును పర్యవేక్షించాలని డీఆర్డీవో సురేందర్‌కు సూచించారు. పంట నష్టం వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి అధిక వర్షాలతో తెగిపోయిన ఊరకుంట చెరువు, సోమ్లా నాయక్ చెరువు, కొండెంగల చెరువు, మల్లారం పెద్ద చెరువులతో పాటు జిల్లావ్యాప్తంగా అన్ని చెరువులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకుల స్వచ్ఛభారత్



**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండలంలోని బాబానగర్ ప్రాథమిక పాఠశాల, బాచన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు జరుగుతున్న సేవాపక్షం కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు ఆరె రవీందర్ తెలిపారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ మొదటిసారి ప్రధాని అయిన తర్వాత 2014లో తీసుకురావడం జరిగిందన్నారు. స్వచ్ఛభారత్ అనేది ప్రపంచంలోనే గుర్తింపు పొందిన ఒక కార్యక్రమమని ఆయన కొనియాడారు. దీంట్లో తప్పకుండా ప్రతి పౌరుడు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బిర్రు రామకృష్ణ, కిసాన్ మోర్చా అధ్యక్షుడు తోట గంగాధర్, బాబానగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు మంద సురేష్, మండల నాయకులు కొండగంగాధర్ గౌడ్, నాగుల భూమన్న, తోట రమేష్, కృష్ణ, బాచన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు శెట్టి లక్ష్మణ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శెట్టి ప్రేమ్‌చంద్, సుదర్శన్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయిలో మెగా ఆరోగ్యశిబిరం



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య మహిళ శక్తివంతమైన కుటుంబం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎముకలు, కీళ్ల వైద్యులు షెహనాజ్, స్త్రీ వైద్యులు రమ్య, చర్మవ్యాధి నిపుణులు అవంతి, కంటి వైద్యులు లక్ష్మి నర్సయ్య దాదాపు 200 మంది రోగులను పరీక్షించారు. డీఎంహెచ్ఓ రాజశ్రీ వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు షారోన్ షైని క్రిస్టినా, ఆయుష్ డాక్టర్ భువన, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, దేవపాలం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## హరితహారంలో వెదురును ప్రోత్సహించాలి



**అక్షరటుడే ఇందూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో వెదురును ప్రోత్సహించాలని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని వినాయక్ నగర్‌లోని విగ్రహాల పార్కులో కేతయ్య స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గంలో మహేంద్రులకు ఐదు ఎకరాల భూమి కేటాయించి అందులో వెదురు మొక్కలను పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. నాణ్యమైన వెదురు బొంగు దొరకక మహేంద్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖమ్మం నుంచి వెదురును తేవడానికి రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని తెలిపారు. మహేంద్ర చేతివృత్తిని బతికించాలంటే ప్రభుత్వాలు ప్రతి నియోజకవర్గంలో వెదురు మొక్కలను నాటాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు దేవేందర్, శంకర్, విజయ్, అజయ్, చంద్రకాంత్, శ్రీలత, జయ, రుక్మిణి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడికి నిరసనగా ధర్నా




**అక్షరటుడే, కమ్మరపల్లి:** మోర్తాడ్ మండల కేంద్రంలో బాల్కొండ నియోజకవర్గం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు గురువారం ధర్నా నిర్వహించారు. ఇటీవల ఏర్గట్ల మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ కులస్థులకు, వీడీసీ సభ్యులకు గొడవ జరిగింది. అయితే న్యూస్ కవరేజీ కోసం వెళ్లిన జర్నలిస్ట్ అశోక్‌పై వీడీసీ సభ్యులు దాడి చేశారు. దీంతో సదరు జర్నలిస్టు వీడీసీ సభ్యులపై సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేయగా.. విచారించి చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు. అయితే విలేకరిపై దాడిని ఖండిస్తూ.. ఇతర జర్నలిస్టు సంఘాలు ధర్నాకు దిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి అనేది భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో బాల్కొండ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.





## తెయూలో బతుకమ్మ సంబరం

తెలంగాణ యూనివర్సిటీలో గురువారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ యాదగిరిరావు ముఖ్య అతిథిగా, రిజిస్ట్రార్ యాదగిరి అతిథిగా హాజరై సంబరాలను ప్రారంభించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉమెన్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ భ్రమరాంబిక నేతృత్వం వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా ఈ సంబరంలో పాల్గొన్నారు. **– అక్షరటుడే, డిచ్‌పల్లి**

## బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి కాదు




**అక్షరటుడే, ఇందూరు:** బ్లడ్ క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని అత్యాధునిక వైద్య విధానం ద్వారా నయం చేయవచ్చని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ సీనియర్ వైద్యులు గణేష్ జైషెత్వార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం బ్లడ్ క్యాన్సర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. బ్లడ్ క్యాన్సర్ అనేది ప్రాణాంతకమైన వ్యాధి కాదని ఈ వ్యాధిని అత్యాధునిక చికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. బ్లడ్ క్యాన్సర్‌కు అభివృద్ధి చెందిన దేశాల్లో రూ. 10కోట్లకు పైగా ఖర్చు అవుతుందని.. భారతదేశంలో మాత్రం రూ.20లక్షలతో వైద్యం పూర్తవుతుందని వైద్యుడు గణేష్ జైషెత్వార్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రతాప్ అనే బాలుడు బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో సంప్రదించగా 2014 నుంచి 2017 వరకు చికిత్స అందజేశామన్నారు. ప్రస్తుతం బాలుడు చదువులో, క్రీడల్లో మెరుగ్గా రాణిస్తున్నాడని స్పష్టం చేశారు. అలాగే సోమేశ్వర్ అనే బాలుడు 13ఏళ్ల వయస్సులో ఇదే వ్యాధితో బాధపడుతుంటే..అతడికి సైతం అద్భుత చికిత్సతో నయం చేశామన్నారు. వర్ని మండలానికి చెందిన రామారావు ఎనిమిదేళ్ల నుంచి బ్లడ్ క్యాన్సర్‌తో యశోద ఆస్పత్రికి రాగా.. ఆయనకు సైతం మెరుగైన చికిత్స అందించామని తెలిపారు. 2025లో బ్లడ్ క్యాన్సర్‌కు ఖచ్చితమైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని వారు స్పష్టం చేశారు. భారతదేశంలో బ్లడ్ క్యాన్సర్ కారణంగా ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. క్యాన్సర్ అంటేనే భయపడే రోజులు పోయాయని ప్రతి క్యాన్సర్‌కు చికిత్సలు తప్పకుండా ఉన్నాయని ఆయన వెల్లడించారు.

## బాధితులకు అండగా నిలుస్తున్న సీఎంఆర్ఎఫ్



బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో..



లింగంపేట మండల కేంద్రంలో..

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని కిసాన్ నగర్‌లో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో చెక్కులను మంజూరు చేయించారు. ముగ్గురు లబ్ధిదారులకు రూ.45వేల విలువైన చెక్కులను మంజూరు చేయించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగభూషణం, మాజీ సర్పంచ్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీ రామరాజు గౌడ్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శరత్, సీనియర్ నాయకులు షేక్ రహీముద్దీన్, అశోక్, ప్రసాద్, రమాకాంత్ పాల్గొన్నారు.

### లింగంపేటలో..

**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రానికి చెందిన గజవాడ మహేష్‌కు గురువారం సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ అందజేశారు. రాష్ట్రంలోనే ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అత్యధికంగా సీఎం సహాయనిధి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావు సహకారంతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, ప్రసాద్, డివిటి అశోక్, కౌడ రవి, భాస్కర్ గౌడ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## నగర పాలక సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం



**అక్షర టుడే, ఇందూరు:** నిజామాబాద్ నగరపాలక సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి మోసం చేసిన ఘటన వెలుగు చూసింది. నవీపేట మండలం నాళేశ్వర్‌కు చెందిన ప్రశాంత్‌కి ఉద్యోగం ఇప్పిస్తానంటూ చిన్నయ్య అనే వ్యక్తి రూ.2.10 లక్షలు మింగేశాడు. ప్రశాంత్ చెప్పిన వివరాల ప్రకారం..తనకు నిజామాబాద్ నగరపాలక సంస్థలో అనిల్ అనే ఉద్యోగి పరిచయమంటూ చిన్నయ్య మాయమాటలు చెప్పాడు. అయితే చిన్నయ్య తన బంధువు కావడంతో ప్రశాంత్ తన మామయ్య రవి ఫోన్ ద్వారా పలు దఫాలుగా డబ్బులు చెల్లించాడు. చిన్నయ్య తన ఫోన్ పేకు కాకుండా ఇతరుల నంబర్లకు రూ.2.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించాడు. అయితే 9 నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో బాధితులు చిన్నయ్యను నిలదీశారు. నవీపేట పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. అయితే అక్కడి పోలీసులు చిన్నయ్యను పిలిపించి ఆరా తీయడంతో.. 15 రోజుల్లో డబ్బులు ఇచ్చేస్తానంటూ చెప్పాడని ప్రశాంత్ తెలిపారు. కానీ రెండు నెలలు గడిచినా ఇప్పటికి ఇవ్వలేదని, అడిగితే తాను డబ్బులు తీసుకోలేదని దబాయిస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు.

## కాకతీయ కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యం

**అక్షరటుడే మెండోరా :** కాకతీయ కాలువలో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మెండోరా సమీపంలోని కాకతీయ కాలువలో గురువారం వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం విచారించగా.. పోచంపాడ్ గ్రామానికి చెందిన షేక్ అజ్గర్(42)గా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ‘108’లో గర్భిణి ప్రసవం



**అక్షరటుడే, బోధన్ :** అత్యవసర పరిస్థితుల్లో 108 సిబ్బంది అంబులెన్స్‌లో గర్భిణికి డెలివరీ నిర్వహించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. బోధన్ మండల కల్దుర్కి గ్రామానికి చెందిన లావణ్యకు పురిటినొప్పులు ఎక్కువ కాగా.. 108కు సమాచారం ఇచ్చారు. తక్షణమే స్పందించిన సిబ్బంది ఆమెను తీసుకుని బోధన్ ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యంలో గర్భిణికి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో డెలివరీ అయ్యింది. పైలెట్ వెంకటి, ఈఎంటీ శివ దినేష్, ఆశావర్కర్ నవనీత సాయంతో డెలివరీ నిర్వహించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని.. తదుపరి వైద్యసేవల నిమిత్తం వారిని బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది పేర్కొన్నారు.

## ఐడీ కార్డుల అందజేత



**అక్షర టుడే, బోధన్:** పట్టణ పరిధిలోని ఏఆర్పీ క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ నిర్వహించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి తోట రాజశేఖర్ (ఏడీఈ) ఆయన తండ్రి తోట లింగం జ్ఞాపకార్థం రూ.10వేల విలువైన ఐడీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రజిని కుమారి, ఉపాధ్యాయులు, బలరాం, శ్రీనివాస్ గౌడ్, రాజు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

**అక్షరటుడే, మెండోరా :** మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు ఇటీవల డ్రంకన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దీంతో పలువురు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పోలీసులు పేర్కొన్నారు. అనంతరం ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, విచారించిన జడ్జి గట్టు గంగాధర్ మాడబోయిన సాయేందర్ అనే వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.


## మట్కా నిర్వాహకురాలికి నాలుగు రోజుల జైలు శిక్ష

**అక్షరటుడే, ఆర్మూర్ :** తన ఇంట్లో మట్కా నిర్వహిస్తున్న ఓ మహిళకు కోర్టు నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన జనార్ధన్ సునీత గత మార్చి నెలలో తన ఇంట్లో మట్కా నిర్వహిస్తూ పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, గురువారం కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. దీంతో విచారించిన ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఆమెకు నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా ఆడటం చట్టరీత్యా నేరమన్నారు.

## 41 లీటర్ల డిఫెన్స్ లిక్కర్ పట్టివేత

**అక్షరటుడే, కామారెడ్డి:** మాచారెడ్డి మండలం ఆరేపల్లిలో ఓ ఇంట్లో అక్రమంగా దాచి ఉంచిన డిఫెన్స్ లిక్కర్‌ను ఎక్సైజ్ అధికారులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు గ్రామంలోని హన్మాండ్లు అనే వ్యక్తి ఇంట్లో ఎక్సైజ్ అధికారుల బృందం సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో ఓ కార్యక్రమ నిర్వహణ కోసం తీసుకొచ్చిన 55 సీసాల మిలటరీ లిక్కర్ (సుమారు 41.25 లీటర్లు) లభించింది. దాంతో మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న అధికారులు ఇంటి యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ మాట్లాడుతూ.. ఇలాంటి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, డిఫెన్స్ లిక్కర్ ఇంట్లో కలిగి ఉండటం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ ఎస్సైలు విక్రమ్, శ్రీనివాస్ రావు, సిబ్బంది పాషా, మైసరాజు, దేవా కుమార్ పాల్గొన్నారు.

## పట్టపగలే దొంగల హల్‌చల్..



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లి మండలం కుర్నపల్లి గ్రామంలో పట్టపగలే దొంగలు హల్‌చల్ చేశారు. ఓ ఇంట్లో చొరబడి బంగారంతో పాటు నగదు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. కుర్నపల్లికి చెందిన తులసిగారి నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు గురువారం ఉదయం బయటకు వెళ్లారు. దీనిని గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న సుమారు మూడున్నర తులాల బంగారంతో పాటు ముప్పై వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లారు. వాళ్లు ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్సై రమ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. క్లూస్ టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ నగరంలో చోటు చేసుకుంది. నగరంలోని అర్సపల్లి భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఎనగందుల మహేశ్ మున్సిపల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆయన కొంతకాలం నుంచి మద్యానికి బానిసగా మారాడు.

ఈ క్రమంలో తాగుడు మానుకోవాలని ఆయనను భార్య మందలించింది. దీంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి నిజామాబాద్ జానకంపేట్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.